
ముస్లిం శ్మశానవాటికలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

శ్మశానవాటిక ప్రహరీని త్వరగా పూర్తిచేయండి

● అధికారులకు ఎమ్మెల్యే కాలేరు ఆదేశం

అంబర్‌పేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం అంబర్‌పేటలో శ్మశానవాటికలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ కార్మికులు

రోడ్లపై చెత్త వేయొద్దు

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చెత్తరహిత నగరంగా చేయాలనే సంకల్పంతో జీహెచ్ఎంసీ చేపట్టిన స్వచ్ఛత కోసం ఒక అడుగుముందుకు కార్యక్రమంలో భాగంగా గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లో పలు బస్తీల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్డుపై వేయొద్దని, ఇంటి ముందుకు వచ్చే చెత్త రిక్షాలు, ఆటోల్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమం జూన్ 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కార్మికులు పాల్గొన్నారు.


లబ్ధిదారుడితో సెల్ఫీ దిగుతున్న లక్ష్మణ్, వినయ్‌కుమార్ తదితరులు

కేంద్ర సంక్షేమ పథకాల కరపత్రాల పంపిణీ

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలకు మేలు చేయడమే లబర్తి సంపర్క్ అభియాన్ ముఖ్య ఉద్దేశమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. లబర్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం చిక్కడపల్లి బాపూనగర్, కల్లేపల్లి బ్రదర్స్ లేన్‌లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిసి మోదీ గ్యారెంటీలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో సెల్ఫీ దిగారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. పదేళ్ల నుంచి మోదీ మచ్చలేని పాలన సాగించారన్నారు. దేశప్రజల అభివృద్ధి, సంక్షేమం, ధర్మరక్షణ, దేశరక్షణలో ప్రత్యేకపాత్ర పోషించి దళారీ వ్యవస్థను రూపుమాపారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు దామోదర్, శ్రీకాంత్, కల్యాణ్, సాయిక్రాంతి, సాయికిరణ్ తదితులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

ఆలయ హుండీ ఆదాయం రూ. 21,67,751

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 21,67,751 రూపాయలు వచ్చింది. మూడునెలల హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయంలో సిబ్బంది, భక్తులు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ ఈవో కె. రామాంజనేయులు, ఆలయ వ్యవస్థాపక వంశీయులు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్ పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నేతలు కార్మికశాఖ రాష్ట్ర జాయింట్ కమిషనర్ చంద్రశేఖరానికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి వి. మధు మాట్లాడుతూ.. జీతాలు పెంచాలని ఏడాదిన్నర నుంచి కార్మికులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీలం మధు, గద్దల శ్రీను, మహేందర్, అరవింద్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసి ఆరేళ్లయినా అందని అలవెన్స్‌లు

బర్కత్‌పుర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భారత్ ఎర్త్ మూవర్స్ కంపెనీలో పనిచేసి పదవీ విరమణ చేసి ఆరేళ్లయినా తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వలేదని ఆ సంస్థ విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ నరసింహారావు అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ సీఎండీగా విధులు నిర్వహించిన నటరాజన్ తనకు అలవెన్సులు రాకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. దాదాపు రూ. 2 కోట్ల రూపాయలు నష్టపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది సంవత్సరాలుగా న్యాయపోరాటం చేస్తున్నానని, సుప్రీంకోర్టును ఆశ్రయించినా న్యాయం జరగలేదన్నారు. న్యాయం చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ ద్వారా విన్నవించానని తెలిపారు. అలవెన్సులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నానని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరారు.

ఎంఎంటీఎస్ రైలు దిగుతూ
గాయపడిన మహిళ మృతి

బర్కత్‌పుర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న ఎంఎంటీఎస్ రైలు దిగుతూ గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌లో నివసిస్తున్న అనిత(28) ఈనెల 26వ తేదీన కర్నూలు నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. చందానగర్ కాకుండా పొరపాటున ఫలక్‌నుమా వెళ్లే ఎంఎంటీఎస్ రైలు ఎక్కింది. రైలులో ఉన్న ప్రయాణికులు చందానగర్ వెళ్లదని చెప్పడంతో కదులుతున్న రైలు దిగుతూ తీవ్రంగా గాయపడింది. ఆమెను రైల్వే పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరాపార్కులో ఓపెన్ జిమ్‌కు మరమ్మతులు


విరిగిన జిమ్ పరికరం

కవాడిగూడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరా పార్కులో క్రీడా పరికరాలకు తుప్పు అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విరిగిపోయిన ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతు చేయించారు. పార్కులో తుప్పు పట్టిన క్రీడా పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేనేజర్ భాస్కర్ తెలిపారు.


మరమ్మతు చేసిన తర్వాత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జీహెచ్ఎంసీ ఉద్యోగులకు ఎన్నికల జీతభత్యాల చెల్లింపు

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు ముగిసి నాలుగు నెలలు అయినా విధులు నిర్వహించిన జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించలేదని ఆంధ్రజ్యోతిలో ఈనెల 26వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

గురువారం ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించారు. కమిషనర్ ఆదేశాలతో ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బందికి జీతభత్యాలు చెల్లించారు. దీంతో ఉద్యోగులు ఆంధ్రజ్యోతి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐరన్, కాల్షియం లోపంతో మహిళలకు అనారోగ్య సమస్యలు

● ప్రముఖ వైద్యురాలు నర్మద


మాట్లాడుతున్న డాక్టర్ హెచ్. నర్మద

బర్కత్‌పుర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 70 శాతం మహిళలు ఐరన్, కాల్షియం లోపంతో బాధపడుతున్నారని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ హెచ్ నర్మద అన్నారు. గురువారం నిజాంకళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐరన్, కాల్షియం లోపాలపై సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ఇటీవల గ్రామాల్లో చేసిన పరిశోధనల వల్ల అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని, 40 ఏళ్ల వయస్సుగల మహిళలు ఐరన్, కాల్షియం లోపం వల్ల 80 ఏళ్ల వృద్ధులుగా కనిపిస్తున్నారని అన్నారు. కాల్షియం, విటమిన్ లోపాల వల్ల మహిళలు రక్తహీనత, ఎముకల బలహీనత, తదితర రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఐరన్, కాల్షియం సమృద్ధిగా లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. 12 ఏళ్ల నుంచి బాలికలకు అన్ని రకాల విటమిన్‌లు సమృద్ధిగా ఉన్న ఆహారం అందించాలన్నారు. 40 ఏళ్ల దాటిన ప్రతిమహిళ గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా మూడు దశల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. జంక్, బేకరి ఫుడ్స్ తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు శాతం విపరీతంగా పెరుగుతుందని, దీనివల్ల థైరాయిడ్, డయాబెటిస్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. భీమా, జిల్లా కోర్టు రిటైర్డ్ ప్రిన్సిపల్ జడ్జి ఉదయగౌరి, హైకోర్టు న్యాయవాది సాజియా పర్వీన్, ఇంజనీర్ చెన్న కేశ్వరి, నిజాంకళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ ఎస్. స్రవంతి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ గీత, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

దోమలగూడలో కార్డన్ సెర్చ్

● ధ్రువీకరణ పత్రాలు లేని పది వాహనాలు సీజ్



పోలీసులకు సూచనలు ఇస్తున్న డీసీపీ ఆనంద్, భీమామైదాన్‌లో స్థానికుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కవాడిగూడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్ బస్తీవాసులకు సూచించారు. దోమలగూడ పీఎస్ పరిధిలో గురువారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. భీమా మైదాన్ బస్తీలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. డీసీపీ ఆనంద్, ఏసీపీ మొగులయ్య మాట్లాడుతూ.. బస్తీలో గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐలు దొంతి రెడ్డి, డి. రాజు, డీఐ వరప్రసాద్, ఎస్ఐలు నాగరాజురెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎస్ఐ హరీష్, నయిమ్‌ఖాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వినికిడి లోపంగల ఉద్యోగులకు పీఆర్సీ ఫిట్‌మెంట్ అమలు చేయాలి

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వినికిడి లోపం ఉన్న దివ్యాంగ ఉద్యోగులకు రావాల్సిన రెండో పీఆర్సీ ఫిట్‌మెంట్‌ను వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. శివానందం, ఎస్. శివప్రసాద్ కోరారు. గురువారం రాష్ట్ర పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం వినికిడి లోపం (డీడీఈఏ) ఉన్న ఉద్యోగులకు రోస్టర్ పాయింట్స్(100, 31, 131, 231, 331) అమలులో ఉన్నాయని,వీటిని రెండో పీఆర్సీలో పొందుపర్చాలని కోరినట్లు తెలిపారు.


పీఆర్సీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

అంధ ఉద్యోగులకు రవాణా భత్యం పెంచాలి

బర్కత్‌పుర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అంధ ఉద్యోగులకు రవాణా భత్యం మూడు నుంచి ఆరువేల రూపాయలకు పెంచాలని డెవలప్‌మెంట్ వేల్ఫేర్ ఆఫ్‌ది బ్లైండ్(డీడబ్ల్యుయూఏబీ) ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు, ఆలిండియా కాన్ఫడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ (ఏఐసీబీ) ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాస్ కోరారు. గురువారం పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రీడర్స్ అలవెన్స్ పెంచాలని, కేంద్ర ప్రభుత్వ అంధ ఉద్యోగులతో సమానంగా నాలుగు రోజుల అదనపు క్యాజువల్ లీవులు మంజూరు చేయాలని, పెన్షనదారులకు మెడికల్ అలవెన్సులు రెట్టింపు చేయాలని, ఉన్నత చదువులు చదవడానికి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులతో సమానంగా ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని కోరారు.

న్యాయ అధ్యయనం-కంపెనీ సెక్రటరీ కోర్సులపై
లా విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): న్యాయ అధ్యయనంతో పాటు కంపెనీ సెక్రటరీ కోర్సుల అధ్యయనం లా విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపయోకరంగా ఉంటుందని ఎమ్మెల్యే, అంబేడ్కర్ విద్యా సంస్థల సెక్రటరీ జి. వినోద్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో అంబేడ్కర్ కాలేజీ లా విద్యార్థులకు ఐసీఎస్ఐ చాప్టర్‌తో కలిసి న్యాయ అధ్యయనం-కంపెనీ సెక్రటరీ కోర్సులపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న వినోద్, న్యూ ఢిల్లీకి చెందిన ఐసీఎస్ఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సీఎస్ రాజవోలు వెంకటరమణ మాట్లాడుతూ.. లా విద్యార్థులకు న్యాయశాస్త్రంతోపాటు కంపెనీ సెక్రటరీ కోర్సులు చదివే అవకాశాలను కల్పించడం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తద్వారా విద్యార్థులకు లా సర్టిఫికెట్‌తో పాటు కంపెనీ సెక్రటరీ షిప్‌లో ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ లభిస్తుందని పేర్కొన్నారు. సదస్సులో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సీఎస్ లక్ష్మీనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తప్పి పోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి నాగమయ్యకుంట వద్ద పదేళ్ల వయస్సుగల బాలుడు రోడ్డుపై తిరుగుతున్నాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అతడిని చేరదీసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. వివరాలు తెలుసుకోగా.. వారాసిగూడ ఇస్లామియా అజీజ్ ఉల్ ఉలూమ్ మదర్సాలో ఉండే జైద్ అన్సారీ అని తేలింది. పోలీసులు బాలుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి అతడిని వారికి అప్పగించారు.


శ్రావణ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ మైనార్టీ కమిటీ చైర్మన్ హర్షద్ షేక్

గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ మైనార్టీ కమిటీ
కో-ఆర్డినేటర్‌గా శ్రావణ్‌కుమార్

ముషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గండి శ్రావణ్‌కుమార్ గ్రేటర్ హైదరాబాద్ మైనార్టీ కమిటీ కో-ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు.

కమిటీ చైర్మన్ హర్షద్ షేక్ గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఇంటర్ కాలేజీల అడ్మిషన్ల దందాపై చర్యలు చేపట్టాలి

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్పొరేట్ ఇంటర్ కాలేజీలు చేస్తున్న అడ్మిషన్ల దందాపై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన విద్యా సంవత్సరానికి మరో రెండున్నర నెలల సమయం ఉన్నప్పటికీ, పేరొందిన కొన్ని విద్యాసంస్థలు ఇప్పటికే 90 శాతానికి పైగా అడ్మిషన్లు పూర్తిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రమంగా చేపట్టిన అడ్మిషన్లను రద్దు చేసి, ఇంటర్ బోర్డును ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉమ్రా వెళ్తున్న మైనారిటీ నాయకుడికి సన్మానం

ముషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ నాయకుడు నషీర్ (అత్తుభాయ్) అనుచరులతో ముస్లింలు పవిత్రంగా భావించే ఉమ్రాకు బయల్దేరారు. డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం షరీఫ్, జునేద్‌బాగ్దాదీ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన ఆకులతో సాయిల్ కండిషనర్


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న రోనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ మ్యాపిల్‌టౌన్ విల్లాస్‌లో అధునాతన విధానంలో సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టారు. యాక్సిలరేటెడ్ ఎనరోబిక్ కంపోస్టింగ్ విధానంలో ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటుచేసి ఎండిన ఆకులను అధిక పోషకాలు గల సాయిల్ కండిషనర్(ఆర్గానిక్ ఎరువు)గా తయారుచేస్తున్నారు. ఇందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) హైదరాబాద్, సీఎస్ఐఆర్ సాంకేతిక సహకారమందిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీలోని చెట్ల నుంచి రాలిన ఆకులను ప్లాంట్ ద్వారా ఎరువుగా మారుస్తున్నారు. నెలకు సుమారు 10 టన్నుల సాయిల్ కండిషనర్ తయారు చేస్తున్నారు. ఈ ఎరువుకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ప్లాంట్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ గురువారం పరిశీలించారు. మాపిల్‌టౌన్ యజమానులు, సీఎస్ఐఆర్, ఐఐసీటీ కృషిని కమిషనర్ అభినందించారు. ఇతర గేటెడ్ కమ్యూనిటీలూ ఈ తరహా ఏర్పాట్లకు ముందుకు రావాలని కోరారు.


ఇఫ్తార్ విందులో పద్మారావుగౌడ్, ముఠాగోపాల్, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక

ముషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక అని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. గురువారం ముషీరాబాద్ అషీర్‌ఖానా కమిటీ ప్రధాన కార్యదర్శి జాఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. పద్మారావుగౌడ్‌తో పాటు ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డి. శివముదిరాజ్, శ్రీధర్‌చారి, ముచ్చకుర్తి ప్రభాకర్, అషీర్‌ఖానా కమిటీ నాయకులు వాహిద్ అలీ, అలందార్ అబ్బాస్, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు తథ్యం : దానం


దానం నాగేందర్‌ను సన్మానించిన భూపాల్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గురువారం చిక్కడపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి. భూపాల్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు దానం నాగేందర్‌ను కలిసి సత్కరించారు. నాగేందర్ మాట్లాడుతూ.. తన గెలుపును ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. దానంను కలిసిన వారిలో నాయకులు రాములు, వర్మ, శ్రీను తదితరులు ఉన్నారు.

కిషన్‌రెడ్డికి భారీ మెజార్టీ అందించాలి : కావ్యారెడ్డి

బర్కత్‌పుర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి భారీ మెజార్టీ అందించాలని అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలను ఆయన సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి కోరారు. గురువారం కాచిగూడ డివిజన్ లింగంపల్లి, నృపతుంగ కళాశాల లేన్, బర్కత్‌పురా, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి బీజేపీకి ఓటు వేయాలని ఆమె అభ్యర్థించారు. 2019 ఎన్నికల్లో కిషన్‌రెడ్డికి అంబర్‌పేట నియోజకవర్గం నుంచి 45 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందని, ఈసారి అంతకంటే ఎక్కువ మెజారిటీ అందించాలని కోరారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఎ. సూర్యప్రకాష్ సింగ్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలకు మరమ్మతులు చేయాలి


వేం నరేందర్‌రెడ్డిని కలిసిన సాయిబాబా

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై గల తెలుగు వెలుగుల కళామూర్తుల విగ్రహాలకు మరమ్మతులు చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా కోరారు. గురువారం ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగు మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి జాతికి అంకితం చేశారని తెలిపారు. దాని వల్ల ట్యాంక్‌బండ్‌కు, హైదరాబాద్ నగరానికి ఎంతో వన్నెవచ్చిందని అన్నారు. కొన్ని విగ్రహాలు శిథిలావస్థకు చేరాయని, వాటికి మరమ్మతులు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు
కనీస వేతనం రూ. 28 వేలుగా నిర్ణయించాలి

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ. 28 వేలుగా నిర్ణయించాలని కోరుతూ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, అలైడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాష్ట్ర అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కన్వీనర్ యాటల సోమన్న మాట్లాడుతూ.. కనీస వేతనాల సలహా మండలిలో చర్చించి ఫైనల్ నోటిఫికేషన్ జీవో విడుదల చేశారని, గెజిట్ చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, దీన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. నాయకులు కుమారస్వామి, మల్లేష్ పాల్గొన్నారు.

జలమండలి ఉద్యోగిపై..
దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న రాంబాబు యాదవ్

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జలమండలి ఉద్యోగిపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు జి. రాంబాబుయాదవ్, వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీహెచ్ రమేష్ మాదన్నపేట డివిజన్‌లో జలమండలి ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుర్మగూడకు చెందిన అమీనాబేగం ఇంట్లో డ్రైనేజీని రమేష్ శుభ్రం చేశాడు. చెత్తా చెదారం తొలగించలేదని ఆమె కుమారుడు రమేష్‌పై దాడిచేసి గాయపరిచాడన్నారు. బాధితుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎంఐఎం, ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకులు ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని అతడిపై ఒత్తిడి చేశారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై జలమండలి ఎండీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

లక్ష్మీగణపతి ఆలయంలో శత కలశాభిషేకం

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోగల లక్ష్మీగణపతి దేవాలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శత కలశాభిషేకం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.